త్వరలోనే ఆర్‌ఓబీ ప్రారంభం

- చార్మినార్‌ జోనల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌ రెడ్డి
- ఫలక్‌నుమా రైల్వే ఓవర్‌ బ్రిడ్జి పనుల పరిశీలన


ఫలక్‌నుమా ఆర్‌ఓబీ పనులు పరిశీలిస్తున్న జోనల్‌ కమిషనర్‌ శ్రీనివాస్‌ రెడ్డి

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా రైల్వే ఓవర్‌ బ్రిడ్జి (ఆర్వోబీ) పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోనల్‌ కమిషనర్‌ సోలిపేట శ్రీనివాస్‌ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్ట్స్‌, ఇంజినీరింగ్‌, టౌన్‌ ప్లానింగ్‌ విభాగాల అధికారులతో కలిసి ఫలక్‌నుమాలోని ఆర్వోబీ పనులను బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జిపై సీసీ రోడ్డు, వీధి దీపాలు, డివైడర్‌ మార్కింగ్‌ పనులు పూర్తయ్యాయన్నారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ చీఫ్‌ ఇంజినీర్‌ సహదేవ్‌ రత్నాకర్‌, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా సర్కిళ్ల డీసీలు సురేందర్‌, అరుణ కుమారి, ప్రాజెక్ట్‌ ఎస్‌ఈ శ్రీనివాస్‌, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్‌ విష్ణువర్ధన్‌, టౌన్‌ ప్లానింగ్‌ సిటీ ప్లానర్‌ మహ్మద్‌ అబ్దుల్‌ మజీద్‌, ఈఈలు సనావుద్దీన్‌, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పురస్కార గ్రహీతలతో ఆచార్య వెల్దండ నిత్యానందరావు

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాల ప్రదానం

నాంపల్లి: తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం మొదటి రోజు 24 మంది ప్రముఖులకు అందజేయగా, రెండో రోజు 24 మందికి అందజేశారు. బుధవారం పురస్కారాల ముగింపు సభ నాంపల్లి ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.5116 నగదుతో పాటు శాలువ, అభినందన పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానందరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం పట్టణ పర్యావరణ ప్రాంతీయ అధ్యాయన కేంద్రం పూర్వ సంచాలకుడు ఆచార్య ఎస్‌.భూపతిరావు చేతుల మీదుగా గ్రహీతలు పురస్కారాలు అందుకున్నారు. వ్యక్తిత్వ వికాస రంగంలో కీర్తి పురస్కారాన్ని అందుకున్న 92 ఏళ్ల వయస్సు గల ప్రముఖ ఇంజినీరు తిరువక్కల్‌ శోభనాద్రి పురస్కారం అందుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తిరువక్కల్‌ శోభానాద్రి తనవంతుగా వర్సిటీకి రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. రిజిస్ట్రార్‌ ఆచార్య కోట్ల హనుమంతరావు, విస్తరణల సేవా విభాగం అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రింగు రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

సుల్తాన్‌బజార్‌: 10 జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆయూష్‌ శాఖ ఆధ్వర్యంలో కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని లయన్‌ ఆకుల రవీందర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సేవలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆయూష్‌ శాఖ ఆయుర్వేద వైద్యాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో మెడికల్‌ ఆఫీసర్లు రామ్‌దాస్‌, డాక్టర్‌ నర్మద, డాక్టర్‌ రమా శ్రీదేవి, డాక్టర్‌ అజీజ్‌, డాక్టర్‌ ఆయేషా, డాక్టర్‌ అస్నానాలతో పాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఊరట

చార్మినార్‌: జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఊరట లభించినట్లయ్యిందని బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్‌ ఫిరాసత్‌ అలీ బాక్రీ అన్నారు. చార్మినార్‌ లోని పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించి ప్రధాని మోదీ చేపట్టిన పథకాలను పలువురికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపుతో దాదాపు 295 వస్తువులు చౌకగా మారాయన్నారు.

మహిళ అదృశ్యం


సలిదా బేగం

గౌలిపురా: మహిళ అదృశ్యమైన ఘటన భవానీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. భవానీ నగర్‌ తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన షేక్‌ మహబూబ్‌ కూతురు సలిదా బేగం (35) మానసిక వ్యాధితో బాధ పడుతోంది. కాగా ఈనెల 21న సలిదా బేగం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

యాకుత్‌పురా: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ అన్నారు. రెయిన్‌ బజార్‌ చమన్‌, మాదన్నపేట్‌, ఎస్‌ఆర్టీ కాలనీ, ఖాలేందర్‌, నగర్‌, తలాబ్‌కట్టా, చాచాగ్యారేజ్‌, నషేమన్‌ నగర్‌, సరస్వతి నగర్‌, లలితాబాగ్‌ రైల్వే బ్రిడ్జి రోడ్డు తదితర ప్రాంతాల్లో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. స్థానిక సమస్యలను మజ్లిస్‌ నాయకులు, బస్తీల ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశల వారీగా వాటిని పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మజ్లిస్‌ ఏరియా కమిటీ అధ్యక్షులు, నాయకులు, బస్తీవాసులు, అధికారులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న అభ్యర్థులు

సుల్తాన్‌బజార్‌: వైద్యారోగ్య శాఖలోని 6,269 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీఐటీయూ నాయకుడు భూపాల్‌ ఎండీ ఫసియుద్దీన్‌ డిమాండ్‌ చేశారు. కోఠిలోని టీఎంహెచ్‌ఎస్లో అభ్యర్థులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023-24 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ విడుదల చేసిన 4 నోటిఫికేషన్లు ఇప్పటికీ పూర్తి కాలేదని దీంతో అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ఇటీవల ల్యాబ్‌ టెక్నీషియల్‌ పోస్టుల వరకు వెరిఫికేషన్‌ పూర్తి చేశారని అలాగే నర్సింగ్‌ ఆఫీసర్‌ పోస్టుల ప్రక్రియ సంబంధించిన ప్రావిజినల్‌ మెరిట లిస్ట్‌ మాత్రమే ఇచ్చారని వాళ్లది కూడా ఫైనల్‌ లిస్ట్‌ ఇచ్చి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ చేయాలని కోరారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు.

లఘు చిత్రాలకు ఆదరణ

గన్‌ఫౌండ్రీ: షార్ట్‌ ఫిల్మ్‌ అసోసియేషన్‌ నిర్వహించిన జాతీయ స్థాయి తెలుగు షార్ట్‌ఫిల్మ్‌- 2025 పోటీల్లో టెన టైమ్స్‌ లఘు చిత్రానికి 4 అవార్డులు లభించాయి. ఈ మేరకు బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ లఘు చిత్రాల నటీ నటులు, సాంకేతిక బృందానికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు వీఎన్‌.ఆదిత్య మాట్లాడుతూ.. నగరానికి చెందిన రామడుగు వసంత్‌ దర్శకత్వం వహించిన టెన్‌టైమ్స్‌ చిత్రానికి అవార్డులు రావడం అభినందనీయమని రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు తీయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తెలుగు షార్ట్‌ ఫిల్మ్‌ అసోసియేషన్‌ సభ్యులు బీకేఎస్‌ ప్రసాద్‌, డివి.రాజు, దర్శకుడు మల్లం రమేష్‌, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ పాల్గొన్నారు.

‘స్వస్త్‌ నారి స్వశక్తి పరివార్‌’ను వినియోగించుకోవాలి


శిబిరంలో ఎమ్మెల్యే కౌసర్‌, డాక్టర్‌ పి.వి.శ్రీనివాసరావు

గోల్కొండ: ‘స్వస్త్‌ నారి స్వశక్తి పరివార్‌’ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ సూచించారు. అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో తెలంగాణ రెడ్‌ క్రాస్‌ సొసైటీ సౌజన్యంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గైనకాలజీ, ఈఎన్‌టీ, పీడియాట్రిక్స్‌, జనరల్‌ ఫిజిషియన్‌, డెర్మటాలజీ, డెంటల్‌ విభాగాలతో పాటు ఇతర అన్ని వైద్య చికిత్సలు అందిస్తున్నారన్నారు. స్థానిక యువకులు, మజ్లిస్‌ నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.వి.శ్రీనివాసరావు, రెడ్‌ క్రాస్‌ సొసైటీ తెలంగాణ చైర్మన్‌ భీమ్‌రెడ్డి, కన్వీనర్‌ శిల్పారెడ్డి, పీఆర్‌ఓ మహ్మద్‌ రియాజ్‌, మజ్లిస్‌ నాయకులు హారూన్‌ఫరాన్‌, అమీరుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ


జై సంవిధాన్‌ కార్యక్రమంలో నాయకులు

చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్‌తోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమవుతుందని చాంద్రాయణగుట్ట నియోజకవర్గ జై సంవిధాన్‌ ఇన్‌చార్జి, మానుకొండూర్‌ మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్‌ అన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బోయ నగేశ్‌ ఆధ్వర్యంలో ఉప్పుగూడ డివిజన్‌లో బుధవారం జై సంవిధాన్‌ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్‌, మహిళ, యూత్‌, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం


వరద బాధితులకు సరుకులు అందిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: భారీ వర్షాల వల్ల ఇండ్లు కూలిపోయిన బాధితులకు అండగా ఉంటామని కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. హకీంపేట్‌లో షేక్‌పేట్‌ తహసీల్దార్‌ అనితరెడ్డితో కలిసి బాధితులకు నిత్యావసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే వారం ఉన్నతాధికారులతో కలిసి కార్వాన్‌ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తానన్నారు. కార్పొరేటర్‌ నసీరుద్దీన్‌, నాయకులు ఆలీముద్దీన్‌, హారూన్‌ఫరాన్‌ తదితరులు ఉన్నారు.

పాలిటెక్నిక్‌ కళాశాలలో ‘గ్రాడ్యుయేషన్‌ డే’


పట్టాలు పొందిన విద్యార్థులతో ఆచార్యులు

విజయనగర్‌కాలనీ: మాసబ్‌ ట్యాంక్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో బుధవారం గ్రాడ్యుయేషన్‌ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.చంద్రశేఖర్‌ 2022-25 వరకు వివిధ బ్రాంచ్‌ల్లో విద్యనభ్యసించి ఉత్తీర్ణులైనవారు, ప్రతిభ చూపిన విద్యార్థులకు పట్టాలు, మెరిట్‌ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలిటెక్నిక్‌ విద్యార్థులకు అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ బ్రాంచ్‌ల విభాగాల అధిపతులు సీవీవీ ప్రసాద్‌, హరికృష్ణ, శ్రీనివాసులు, రాజ, రవికాంత్‌రెడ్డి, డాక్టర్‌ ప్రవీణ్‌కుమార్‌, శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న అధికారులు

చార్మినార్‌: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని జిల్లా సైన్స్‌ ఆఫీసర్‌, జిల్లా పర్యావరణ విద్యా బ్రాండ్‌ అంబాసిడర్‌ ధర్మేందర్‌ రావు అన్నారు. హైదరాబాద్‌ జిల్లాలో వరల్డ్‌ క్లీన్‌అప్‌ డే పోస్టర్‌ ను డీఈఓ ఆర్‌.రోహిణీతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ.. పర్యావరణ సమస్యలపై అవగాహన కల్పించడంలో పాఠశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీసుకుంటున్న చొరవను ఆమె ప్రశంసించారు.

అక్టోబర్‌ 30 నుంచి అంతర్రాష్ట్రీయ ఆర్య మహా సమ్మేళనం


సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్‌: న్యూఢిల్లీలోని స్వర్ణజయంతి పార్కులో అక్టోబర్‌ 30, 31 తేదీల్లో అంతర్రాష్ట్రీయ ఆర్యమహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు మహర్షి స్వామి దయానంద సరస్వతి 200 జన్మదిన ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్‌ డి.ధర్మతేజ తెలిపారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను నగరంలో జరిగిన కార్యక్రమంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి సంబంధించి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఇప్పటికే వేలాది మంది ఆర్య ప్రతినిధులు తమ పేర్లను ఆన్‌లైన్‌ ద్వారా నమోదు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య ఆనంద్‌ ప్రకాశ్‌, ఆచార్య నీరజ, వేదమిత్ర, సవిత, శ్యామ్‌ ప్రసాద్‌, నరేంద్ర పాల్గొన్నారు.

నేడు జాబ్‌ మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్‌ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈనెల 25న (నేడు) జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఉపాధి అధికారి అమర్లపూరి వందన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రముఖ ప్రైవేట్‌ సంస్థల్లోని 200 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌, డిగ్రీ విద్యార్హత ఉండి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఉదయం 11 గంటలకు విజయనగర్‌ కాలనీలోని హైదరాబాద్‌ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఫొటోలు, సర్టిఫికెట్లతో హాజరు కావాలని మరిన్ని వివరాలకు 83284 289 33 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ప్రపంచ ఫార్మసిస్ట్‌ దినోత్సవ వేడుకలు

సుల్తాన్‌బజార్‌: ఈనెల 25న నిర్వహించనున్న ప్రపంచ ఫార్మసిస్ట్‌ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని తెలంగాణ గవర్నమెంట్‌ ఫార్మసి ఆఫీసర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌ గౌడ్‌ పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, గౌరవ అతిథిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌, ఇతర శాఖల అధికారులు, వైద్యులు, సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఫార్మసి సమస్యలపై నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు ఉదయం 10 గంటలకు నల్లకుంటలోని ఫీవర్‌ ఆసుపత్రి ఆడిటోరియానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్‌ ప్రెసిడెంట్‌ జాలిగామ అశోక్‌ పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ సంబరాలు

గౌలిపురా: బతుకమ్మ బావి వద్ద నేడు బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-7 డిప్యూటీ కమిషనర్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఎల్‌ఎఫ్‌, పొదుపు సంఘాలు, మహిళలు, యువతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందమైన బతుకమ్మలను తయారు చేసిన మొదటి 3 బతుకమ్మలకు ఈనెల 29న పీపుల్‌ ప్లాజా వద్ద జరగనున్న బతుకమ్మ సంబరాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

‘ప్రజాస్వామ్యానికి పాఠాలు’ పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: ఓరియంటన్‌ బ్లాక్‌ స్వాన్‌ పబ్లికేషన్‌ ప్రచురించిన భారత అత్యవసర పరిస్థితికి 50 ఏళ్లు ‘ప్రజాస్వామ్యానికి పాఠాలు’ అనే పుస్తకావిష్కరణ సభ సైఫాబాద్‌లోని విద్యారణ్య పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఆఫ్రిక్‌ సెంటర్‌ ఫర్‌ ఎపిస్టమాలజీ అండ్‌ ఫిలాసఫీ ఆఫ్‌ సైన్స్‌ సీనియర్‌ రీసెర్చ్‌ అసోసియేట్‌ పీటర్‌ రోనాల్డ్‌ డిసౌజ, హెచ్‌సీయూ విశ్రాంత ప్రొఫెసర్‌ సతీష్‌ హెగ్డే, గీతం విశ్వవిద్యాలయం వైస్‌ చాన్స్‌లర్‌ ఎరోల్‌ డిసౌజ, సదస్సు ప్రతినిధి హర్ష సేథి పాల్గొన్నారు.

బోగస్‌ సర్టిఫికెట్లతో మోసపోవద్దు

గన్‌ఫౌండ్రీ: కిక్‌ బాక్సింగ్‌ పేరిట నకిలీ సంఘాలు ఇచ్చే బోగస్‌ సర్టిఫికెట్లతో క్రీడాకారులు నష్టపోవద్దని తెలంగాణ కిక్‌బాక్సింగ్‌ అసోసియేషన్‌ విజ్ఞప్తి చేసింది. ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్‌ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కిక్‌ బాక్సింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు శ్రీరామాంజనేయులు మాట్లాడారు. తెలంగాణలో అన్ని అధికారిక గుర్తింపు ఉన్న ఏకైక సంస్థ తెలంగాణ కిక్‌ బాక్సింగ్‌ అసోసియేషన్‌ అని 25 జిల్లాల్లో పటిష్టమైన సభ్యత్వం ఉందన్నారు. కొంతమంది క్రీడా సంఘాల పేరుతో పోటీలు నిర్వహిస్తూ సర్టిఫికెట్లు అందజేస్తున్నారని, వాటికి ఎలాంటి గుర్తింపు ఉండదనే విషయాన్ని క్రీడాకారులు గుర్తించుకోవాలని కోరారు. తెలంగాణ కిక్‌బాక్సింగ్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఎం.మహిపాల్‌, కోశాధికారి పి.శ్రీనివాస్‌, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జీఎన్‌ఐటీఎస్‌లో ‘తేజస్య-2025’


తేజస్య సావనీర్‌ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ ఇంజినీరింగ్‌ కళాశాలలో ‘ఇంజినీర్స్‌ డే తేజస్య’ ను బుధవారం నిర్వహించారు. ఓయూ ఈఈఈ హెచ్‌ఓడీ డాక్టర్‌ కుమార్‌ పెద్దపల్లి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్‌ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపైనే దృష్టిని పెడితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఏఐ, 5జీ ఆవిష్కరణల వల్ల మనం ఊహించలేని సరికొత్త విషయాలు చూస్తున్నామన్నారు. దశాబ్దాల క్రితమే మోక్షగుండం విశ్వేశ్వరయ్య మానవ జాతికి సాధ్యం కానిది ఏది లేదని నిరూపించారని కొనియాడారు. అనంతరం ఇంజినీరింగ్‌ విభాగంలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు యంగ్‌ ఇంజినీర్‌ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో 5జీ నిపుణుడు జి.బ్రహ్మారెడ్డి, ఐఎస్‌టీఈ అధ్యక్షుడు, కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.రమేశ్‌రెడ్డి, ఐఎస్‌టీఈ ఉపాధ్యక్షులు డాక్టర్‌ జీ.పి.ప్రసాద్‌ రెడ్డితో పాటు వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్‌ చైర్మన్‌కు వినతిపత్రం అందజేత

గోల్కొండ: ఇబ్రహీంబాగ్‌లోని హిందూ శ్మశాన వాటిక స్థలం తమకు దక్కేలా చూడాలని ఇబ్రహీంబాగ్‌ శ్మశాన వాటిక పరిరక్షణ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు సమితి సభ్యుడు ఎస్‌.రాజు వస్తాద్‌ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ జి.నిరంజన్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఈ స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు కేటాయించిందని ప్రస్తుతం సంస్థ వారు అక్కడ అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. దశాబ్దాలుగా సదరు స్థలాన్ని ఇబ్రహీంబాగ్‌ వాసులు శ్మశానవాటికగా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో పాటు హైదరాబాద్‌ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడి న్యాయం చేస్తానని చైర్మన్‌ హామీనిచ్చారని వారు తెలిపారు.

బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో..

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి జానపద గేయాలతో మహిళలు ఆడిపాడారు. అదేవిధంగా సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో రచయిత్రి సంధ్య విప్లవ్‌ బతుకమ్మపై చేసిన ఏకపాత్రాభినయం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే ఆమె రచించిన ‘బతుకమ్మ తిరిగొస్తారు’ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్‌ అలేఖ్య పుంజాల, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌ వెన్నెల గద్దర్‌ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మను ప్రతిబింభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ కల్వ సుజాత, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్‌.బాలచారి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి, కర్మన్‌ఘట్‌ ఆంజనేయ స్వామి దేవస్థానం డైరెక్టర్‌ కవితతో పాటు ఆర్యవైశ్య మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి సతీమణి లలిత శ్రీహరి అన్నారు. ఎల్బీ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో బుధవారం క్రీడాశాఖ మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్‌ రంజన్‌ సతీమణి రుచి జయేష్‌ రంజన్‌, స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనారెడ్డి సతీమణి హర్షశ్రీ, స్పోర్ట్స్‌ అథారిటీ ఎండీ సోని బాలాదేవి పాల్గొన్నారు.


బతుకమ్మలతో క్రీడా శాఖ మంత్రి సతీమణి లలిత శ్రీహరి, రుచి జయేష్‌ రంజన్‌